## సింగిల్ పేజీ కథలు

# శకునం

**ఆఫీసుకు బయలుదేరానన్నమాటేగాని మనసులో ఒకటే దిగులుగా ఉంది. ఎట్నుండి ఏ ఆపద ముంచుకొస్తుందేమోనని హడలి ఛస్తున్నాను. అస్సలు ఇంటికి క్షేమంగా వెళ్తాడా తను! ఎందుకంటే..**

ఇంటి దగ్గర్నుండి బయలుదేరానో లేదో కాళ్లకడ్డం పడింది ఓ నల్లపిల్లి. బొక్కబోర్లా పడబోయి తమాయించుకున్నాను. ముచ్చెమటలు పట్టాయి. నేను దేని గురించైతే ప్రొద్దునే లేచిన దగ్గర్నుండీ టెన్షన్ పడుతున్నానో మళ్లీ అదే దరిద్రం ఎదురొచ్చింది.

అయిపోయింది! అంతా అయిపోయింది.

ఈరోజేదో మూడింది నాకు. లేకపోతే ఈ దరిద్రపు శకునమేంటీ? ఒళ్లంతా చెమటలు పట్టాయి. చిరాగ్గా ఉంది.


మరొక రోజైతే ఆఫీసుకి ఎగనామం పెట్టి ఇంటి దగ్గరే కృష్ణా, రామా అనుకుంటూ కదలకుండా కూచునేవాడ్ని.. ఇలాంటి శకునాలు ఎదురైతే.

కానీ ఈరోజు ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వుంది. నేను సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాను. మరీ మరీ హెచ్చరించేడు మా బాస్. 'సుబ్బారావ్ నువ్వు పెందలాడే వచ్చి అన్ని పన్లూ దగ్గరుండి చూసుకోవాలని'

ఇలాంటి సమయంలో సెలవుపెడితే ఇంకేమైనా ఉందా? మామూలు సమయాల్లోనే నేనేం చేసినా మా బాస్‌కి నచ్చదు. ఆయన వల్లే నాకు రావాల్సిన ప్రమోషన్ కూడా ఆలస్యమౌతుందేమోనని నాకు అనుమానం కూడా! అలాంటిది ఇలాంటి సమయంలో సెలవుపెడితే ప్రమోషన్ మాట దేవుడెరుగు. ఉన్న ఈ ఉద్యోగానికి రెక్కలొచ్చినట్టే. అందుకనే ఏం చేయడానికి కాళ్లాడ్డం లేదు.

వెళ్లడానికి మనసొప్పడం లేదు. మానడానికి ధైర్యం చాలడం లేదు. అందుకనే ఆఫీసుకి బయలుదేరక తప్పలేదు.

అస్సలు ఇదంతా మా ఎదురింటి రామారావుగాడివల్లే వచ్చింది. ఎవడైనా సరదా అన్పిస్తే కుక్కని పెంచుకుంటాడు, లేక ఏ చిలకనో ఎలకనో పెంచుకుంటాడు. కానీ వీడేమిటి పిల్లిని పెంచుకుంటున్నాడు. అందులోనూ 'నల్లపిల్లి'.



దాన్ని చూస్తుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. దాని కళ్లు చూస్తుంటే వంట్లో వణుకు ప్రారంభమవుతుంది. పిల్లి పిశాచానికి మారు రూపం అంటారు. పిల్లులంటేనే అసహ్యం, భయం.

వాడు ఆ పిల్లిని పెంచడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే పొద్దున లేస్తూనే, ఎక్కడ దాని మొహం చూడవలసి వస్తుందో, ఏ అరిష్టం దాపురిస్తుందో అని భయం నాకు.

ఆ మాటే ఓసారి వాడితో అంటే వెటకారంగా నా వైపోసారి చూసి మూఢనమ్మకాల వలన వచ్చే నష్టాల గురించీ, మూగ జీవాల మీద మనం చూపించ వలసిన ప్రేమ గురించీ గంటన్నర సేపు లెక్చరిచ్చాడు తప్ప, వాడు మారలేదు.

'వీడు మూర్ఖుడు. వీడ్ని మార్చడం బ్రహ్మతరం కూడా కాదు' అన్న అభిప్రాయానికి వచ్చి వాళ్లింటికే వెళ్లడం మానుకున్నాను.

సర్లే వాడి ఏడుపేదో వాడు ఏడుస్తున్నాడని ఇంతకాలం సరిపెట్టుకున్నాను. కానీ.ఉదయం జరిగిన సంఘటనతో వాడిమీద కోపం నాకు అరికాలి మంట నెత్తికెక్కినట్టయింది.

తెల్లవారు జామున పక్కమీద నుంచి లేచీ లేవగానే 'మ్యావ్' అంటూ బెడ్‌లైట్ కాంతిలో ఇంతింత మిడిగుడ్లేసుకుని నాకేసి మిర్రి మిర్రి చూస్తోంది. నల్లగా నిగనిగలాడుతూ కదులుతున్న భూతంలా ఉంది. ఎక్కడో చదివాను కోరికలు తీరని ప్రేతాత్మలే పిల్లుల రూపంలో వస్తాయని. ఆ విషయం గుర్తుకు రాగానే 'కెవ్వ'మని అరవబోయిన కేక భయంతో గొంతులోనే సమాధి అయిపోయింది.

అదిగో అప్పటి నుండి మనసంతా గజిబిజిగా తయారయ్యింది. ఏ పనిమీదా ఏకాగ్రత కుదరడం లేదు. అయినా ఆఫీసుకి బయలుదేరక తప్పదు కనుక ఎలాగోలా తంటాలు పడి ఆఫీసుకి చేరుకున్నాను.

ఐతే నేనూహించినట్లు ఆఫీసులో ఏ విధమైన అసౌకర్యం లేకుండా అంతా సజావుగా జరిగిపోయింది. అంతేకాకుండా ఎప్పుడూ లేంది మా బాస్ నా పనిని మెచ్చుకుని నన్ను కౌగిలించుకున్నంత పనిజేసి ''సుబ్బారావ్ ఈ నెలలో నీకు తప్పక ప్రమోషనిస్తానోయ్'' అని మాటిచ్చి రెండు ఆనందబాష్పాలు కూడా రాల్చాడు. నాకు ఇదంతా కలో! నిజమో అర్థం కావడానికి అయిదు నిముషాలు పట్టింది.

నాకు చాలా ఆనందం అనిపించింది.

ఇంతవరకూ ఏమౌతుందేమోనని తెగ కలవరపడ్డాను.

కానీ నల్లపిల్లి ఎదురవడం గురించి మొట్టమొదటిసారిగా ఆలోచనల్లో పడ్డాను.

పాపం... అనవసరంగా ఆ రామారావునూ, వాడి పిల్లిమీదా నిందలు వేసాను.

రామారావన్నట్లు నావే తప్పుడు ఆలోచన

లేమో?

నావన్నీ నిజంగా మూఢనమ్మకాలేనేమో.

ఎలాగైనా రామారావుకి సారీ చెప్పాలి.. ఇన్నాళ్ళూ వాడిని విసుక్కున్నందుకు.

ఎప్పుడూ అసహ్యించుకునే తను, ఇప్పుడు ఆ పిల్లిని ఎప్పుడెప్పుడు చూద్దామా అన్పిస్తోంది. 'ఎంత చక్కగా ఉంటుందని' మనసులోనే అనుకున్నాను.

గబగబా ఆఫీసు నుండి బయటపడి ఇంటికి చేరుకున్నాను.

యధాలాపంగా ఎదురింటి వైపు చూసాను.

రామారావు కనిపించేడు.

పలకరింపుగా నవ్వాను.

ఎందుకో వాడు తిరిగి నవ్వలేదు.

దిగులుగా ఉన్నట్టు కనిపించాడు.

''అన్నట్టు మీ కిట్టీ ఏది?'' అడిగాను. రామారావు పిల్లిని ముద్దుగా కిట్టీ అని పిలుచుకుంటాడు. దాన్ని చూడాలన్న తహతహతో అడిగాను.

రామారావు కళ్లల్లో నీళ్లు!

''ఇంకెక్కడి కిట్టీ? తెల్లవారే ఎవరి మొహం చూసిందోగాని కారు క్రిందపడి చచ్చిపోయింది...''

ఇంకేదో చెప్తూనే ఉన్నాడు.

నాకింకేమీ వినిపించడం మానేసింది.

తేలుకుట్టిన దొంగలా నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నాను.

**-డి. సత్యారావు** (విశాఖపట్నం)

# అనుబంధం

**అన్నగారికి ఉద్యోగం పోయిందని తెలిసిన దగ్గర నుండి చెల్లెలు హేమ మొహం చాటేయుడం మొదలుపెట్టింది. అంతకుముందు అన్నయ్యా వదినా అంటూ పిఠాపురం నుండి వారానికి ఒకసారైనా కాకినాడ వచ్చి అన్నావదినల దగ్గర వుండి, కావలసినవి వండించుకొని, తిని, ఇంకా తనకు కావలసిన సామాన్లు పట్టుకుపోయేది.**

హేమ, మాలిని వదినా మరదళ్ళులా కాక సొంత అక్కా చెల్లెళ్ళులా ఉంటారు. తల్లీదండ్రీలేని హేమకు అన్నగారే తల్లీ తండ్రి అయి పెంచి, తన స్నేహితుడికిచ్చి పెళ్లి చేసాడు.

చెల్లెలు కడుపునిండా తింటే తన కడుపు నిండిపోయినట్లుండేది రఘుకు. అలాంటి చెల్లెలు తనకు ఉద్యోగం టెంపరరీగానే అయినా పోయిందని తెలియగానే రాకపోకలు తగ్గించేసింది. తగ్గించేయడమేమిటి పూర్తిగా మానేసింది.

తనకు సహాయం చేయాల్సి వస్తుందనా? చెల్లెలు ఆపదలో ఆదుకోకూడదా, ఆడపిల్ల అయినంత మాత్రాన ఎంతసేపూ మా యింటికొస్తే ఏం తెస్తారు, మీ యింటికి వస్తే ఏం పెడతారు అనే ఆలోచించాలా. కుటుంబంలోని కష్టసుఖాలు ఒక్క మగవాడికేనా, ఆడపిల్ల ఎంతసేపూ ఆస్తి దక్కించుకోవడమేనా, ప్రపంచంలో పూర్తిగా మగవాళ్ళుగానీ, పూర్తిగా ఆడవాళ్ళుగానీ ఉంటే బావుండేదేనేమో. అసలు గొడవలన్నీ పెళ్ళి చేసుకున్న దంపతుల మధ్యగానీ, అన్నాచెల్లెళ్ళ మధ్యగానీ, తల్లీకొడుకుల మధ్యగానీ యిలాగే వస్తున్నాయి కదా. బెల్లం చుట్టూ చీమల లాగా డబ్బు దగ్గరే అన్నాచెల్లెళ్ళ బంధుత్వమా? అబ్బా! ఈ ఆడవాళ్ళ మనస్తత్వంతో ఎంత తలనొప్పో.



ఎప్పుడు ఎలా ఉంటారో చెప్పలేం. ఛ.ఛ. నేను యిలా ఆలోచిస్తున్నానేమిటి? చేతిలో డబ్బుల్లేక మతిస్థిమితం తప్పుతోందా? నాకు ఉద్యోగం పోయిందన్న బాధకంటే హేమ చేసిన పనిని జీర్ణించుకోలేకపోతున్నాను అనుకున్నాడు.

మాలిని ఆలోచనలు కూడా యించుమించు అలాగే ఉన్నాయి. హేమను ఎంత ప్రేమగా చూసాను. అయినా సరే ఎలా మారిపోయిందో. చెరువులో నీళ్ళు లేకపోతే చేపలుండవుకదా! ఇప్పుడు మాకు నెల నెలా జీతం లేదు. అందుకే హేమ రావడం మానేసింది.

ఇంతలో హేమ రాసిన ఉత్తరం పోస్టులో వచ్చింది.

''అన్నయ్యా! ఇన్నాళ్ళూ నీ దగ్గరకు రావడం లేదని బాధపడుతున్నావు కదూ! నీకు త్వరలోనే ఉద్యోగం తిరిగి వస్తుందని మీ బావగారు చెప్పారు. చాలా సంతోషం అనిపించింది. మా అన్నయ్య ఏమాత్రం బాధపడినా సహించలేను నేను. నీకు ఉద్యోగం వచ్చిన తరువాత తప్పక వస్తాను. ఈలోపుగా నా గురించి నీవు ఏమి అనుకుంటున్నావో అని భయంగా ఉంది. అన్నయ్యా! ఇన్ని రోజులు నేను నీ దగ్గరకు రాకపోవడానికి కారణం ఉంది. నీవు నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దు.

ఎప్పటిలాగే నేనూ మీ బావగారూ వారం వారం వస్తుంటే మమ్మల్ని ఇదివరకటిలా ఆదరించలేక, నీవు బాధపడతావు. మాకు ఏ లోటూ చేయలేని మనస్తత్వం వదినది. మేం వచ్చి మీకు యింకా యింకా ఖర్చులు పెంచాలి. ఆ ఖర్చులు నీ కష్టకాలంలో నీకు తగ్గించాలని మేము రావడం మానేసాము. నీకు ఉద్యోగం రానివ్వు, ఆఘమేఘాల మీద వచ్చేస్తాం. మిమ్మల్ని ఎప్పుడెప్పుడు చూస్తానా, వదిన చేతి వంట ఎప్పుడెప్పుడు తింటానా అని మనసు ఆరాటంగా ఉంది. వదినను అడిగానని చెప్పు.

ప్రేమతో,

నీ చెల్లెలు

హేమ.''

చెల్లెలి ఉత్తరం చదివిన ఆ అన్నయ్య అనుమానం పటాపంచలైపోయింది.

**-'రాధిక'** (కాకినాడ)